Cell: 9440352036 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్

APTEL/2024/86143 జాతీయ తెలుగు దినపత్రిక

WANTED
స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
చిత్తూరు ఎక్స్‌ప్రెస్ దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలలో రిపోర్టర్లు, జిల్లా కేంద్రాలలో స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
సంప్రదించండి సెల్ : 9440815774

ప్రచురణ : తిరుపతి | సంపుటి : 02 | సంచిక : 142 | అసోషియేట్ ఎడిటర్ : కే ఎల్ కృష్ణంరాజు | మంగళవారం 16 జూన్ 2026 | పేజీలు : 4 | వెల : 3



## భారత అమ్ములపొదిలో మరో శక్తిమంతమైన అస్త్రం

- లాంగ్ రేంజ్ క్రూయిజ్ క్షిపణి పరీక్ష సక్సెస్
- లాంగ్ రేంజ్ ల్యాండ్ అటాక్ క్రూయిజ్ క్షిపణిని విజయవంతంగా పరీక్షించిన డీఆర్‌డీఓ
- ఒడిశాలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ద్వీపం నుంచి ఈ ప్రయోగం
- పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో క్షిపణి రూపకల్పన
- భారత సుదూర లక్ష్య ఛేదన సామర్థ్యం పెరిగిందని వెల్లడి
- డీఆర్‌డీఓ బృందాన్ని అభినందించిన రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

# ప్రాజెక్టుల ఏర్పాటు ఇదే సరైన సమయం



- తయారీ రంగాన్ని ప్రోత్సహించేలా వన్ ఫ్యామిలీ వన్ ఎంట్రప్రెన్యూర్ విధానం
- స్టార్టప్ వెంచర్ కాపిటలిస్టులతో నిర్వహించిన భేటీలో పాల్గొన్న సీఎం
- భూ సమీకరణ విధానం ద్వారా ప్రాజెక్టులకు భూములు ఇస్తున్నామని వివరించిన చంద్రబాబు
- భారత్ అతి పెద్ద ఆర్థికశక్తి అని స్పష్టం

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

స్టార్టప్ వెంచర్ కాపిటలిస్టులతో రౌండ్ టేబుల్ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. సమావేశానికి సింగపూర్‌లోని భారత హైకమిషనర్ శిల్పక్ అంబులే, మంత్రి పి.నారాయణ, సింగపూర్ స్టార్టప్ వెంచర్ కాపిటలిస్టులు హాజరయ్యారు. ఇప్పుడు భారత్ నిద్రపోతున్న ప్రాంతం కాదు. భారత్ సంస్కరణలతో దూసుకుపోతున్న అతి పెద్ద ఆర్థికశక్తి అని సీఎం స్పష్టం చేశారు. ప్రధాని మోదీ లాంటి ఆధునిక ఆలోచనలు ఉన్న వ్యక్తి దేశాన్ని ఓ అద్భుతమైన వేగంతో అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. చైనా లాంటి దేశాలు ఆర్థిక అభివృద్ధి సాధించటానికి దశాబ్దాల కాలం పట్టిందన్న సీఎం వివరించారు. కానీ భారత్‌కు అంత సమయం పట్టటం లేదని అన్నారు. మెడికల్ టెక్నాలజీ సహా ఇతర ఆధునిక పరికరాల తయారీలో భారత్ అగ్రస్థానంలో ఉందని తెలిపారు. ఎలక్ట్రానిక్స్ పరికరాలు ఇప్పుడు భారత్ నుంచి ఎగుమతి అవుతున్నాయని వెల్లడించారు. భారత్‌ను నెంబర్ 1 చేయాలనే లక్ష్యంతో ప్రధాని మోదీ నిర్ణయాలు తీసుకుంటున్నారని తెలిపారు. ఏపీలో పెట్టుబడుల విషయంలో ప్రధాని చొరవ కారణంగా ప్రపంచ స్థాయి సంస్థలు ఏపీకి వచ్చాయని వివరించారు. హిందూ గ్రోత్ రేట్ 1 - మిగతా3లో



## కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కేపై దాడి

- జయపురలో ఆందోళన చేస్తుండగా దాడి చేసిన గుర్తుతెలియని వ్యక్తులు
- అభిజిత్ దీప్కే చెంపపై కొట్టిన గుర్తుతెలియని వ్యక్తులు
- అభిజిత్ దీప్కేపై దాడి చేసిన వారిని చితకబాదిన కాక్రోచ్ పార్టీ కార్యకర్తలు

## తుదిదశలో అహ్మదాబాద్ విమాన ప్రమాద దర్యాప్తు

- ఏఏఐబీ నివేదిక కోసమే ఎదురుచూస్తున్నాం
- ఎయిర్ ఇండియా విమాన దుర్ఘటనపై స్పందించిన కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు
- ఈ దురజటనకు సంబంధించిన దర్యాప్తు తుదిదశలో ఉందని వెల్లడి




# పశ్చిమాసియాలో శాంతికి మార్గం

- అమెరికా-ఇరాన్ ఒప్పందాన్ని స్వాగతించిన ప్రధాని మోదీ
- అమెరికా, ఇరాన్ మధ్య కీలక ఒప్పందం కుదిరినట్టు ప్రకటన
- పశ్చిమాసియాలో ఉద్రిక్తతలకు తెర దించేందుకు అవగాహన
- హర్మూజ్ జలసంధిని తిరిగి తెరవనున్నట్టు ప్రకటించిన ట్రంప్
- ఒప్పందాన్ని స్వాగతించిన ప్రధాని మోదీ.. శాంతి నెలకొనాలని ఆకాంక్ష



**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్**

పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులకు ముగింపు పలికే దిశగా అమెరికా, ఇరాన్‌లు ఒక అంగీకారానికి రావడాన్ని ప్రధాని నరేంద్ర మోదీ స్వాగతించారు. ఈ ఘర్షణ కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడటమే కాకుండా అనేక దేశాల్లో ప్రాణనష్టం సంభవించిందని ఆయన పేర్కొన్నారు. ప్రాంతీయ శాంతి, స్థిరత్వాల పునరుద్ధరణకు ఈ పరిణామం కీలకంగా మారుతుందని తెలిపారు. ముఖ్యంగా అంతర్జాతీయ సముద్ర మార్గాల్లో స్వేచ్ఛాయుత నౌకాయానం, వాణిజ్య కార్యకలాపాలకు భరోసా - మిగతా3లో



## ఇజ్రాయెల్‌కు మోదీ సర్కార్ బ్లైండ్ సపోర్ట్

- విదేశాంగ విధానంలో సమతుల్యత అవసరం: కాంగ్రెస్
- అమెరికా-ఇరాన్ శాంతి ఒప్పందాన్ని స్వాగతించిన కాంగ్రెస్
- పాకిస్థాన్ అంతర్జాతీయ స్థాయిలో ప్రభావం పెంచుకుందని జైరాం రమేశ్ వ్యాఖ్య

అమరవీరులను గుర్తించేందుకు

# 12 సంవత్సరాలు సరిపోలేదా?

- తెలంగాణ ఏర్పాటుపై మరోసారి స్పందించిన జనసేన అధినేత పవన్ కల్యాణ్
- ఆంధ్రప్రదేశ్‌ను విభజించిన తీరును చూసి మాత్రమే ఆవేదన వెలిబుచ్చానని స్పష్టం
- తెలంగాణలో పార్టీకి మంచి భవిష్యత్తు ఉంటుందని నేతలకు హామీ



**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్**

తెలంగాణ ఏర్పాటుకు ఏనాడూ జనసేన అడ్డు చెప్పలేదని ఆ పార్టీ అధినేత, ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మరోసారి స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌ను విభజించిన తీరును చూసి మాత్రమే ఆవేదన వెలిబుచ్చానని స్పష్టం చేశారు. రాష్ట్రాన్ని విభజించిన నాటి నుంచి ఇవాల్టికి కాంగ్రెస్ ధోరణి మారలేదని, కాంగ్రెస్ విభజన తీరు అసంతృప్తిని, అశాంతిని సృష్టించిందని పేర్కొన్నారు. ఢిల్లీలో పార్టీ నేతలతో - మిగతా3లో



## కేవలం వ్యవస్థ వైఫల్యం కాదు

- కోట్ల మంది యువత కలలపై జరిగిన దాడి'
- పేపర్ లీకేజీపై రాహుల్ గాంధీ
- 'విద్యార్థులు పడిన కష్టానికి తగిన ప్రతిఫలం దక్కడం లేదు
- పైగా కలలు కన్నందుకు శిక్ష పడుతోంది'
- రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు
- మరోవైపు నీట్ అభ్యర్థులకు చుక్కలు చూపిస్తున్న ఎన్‌టీఏ

పాపికొండల్లో పర్యాటకుల భద్రత కోసం

# ప్రభుత్వం చర్యలు

- బోట్లలో విస్తృత తనిఖీలు
- పాపికొండల్లో పర్యాటకుల భద్రత కోసం ప్రభుత్వం చర్యలు
- గోదావరి నదిలో పాపికొండలు వెళ్లే పర్యాటక బోట్ల భద్రతపై తనిఖీలు
- ప్రతి బోటుకూ ఫిట్‌నెస్ ధ్రువపత్రం తప్పనిసరిగా ఉండాలని ఆదేశాలు




**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

పోలవరం జిల్లాలో పాపికొండలు పర్యటకుల భద్రత కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గోదావరి నదిలో పాపికొండలు పర్యటనకు వెళ్లే పర్యాటక బోట్లను విస్తృత తనిఖీలు చేయిస్తోంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నదిలో తిరిగే బోట్ల భద్రతా ప్రమాణాలను స్థానిక అధికారులు తనిఖీలు చేస్తున్నారు. ఇటీవల కాలంలో పలు ఘటనలు జరిగిన దృష్ట్యా అప్రమత్తమైన అధికారులు, భద్రతపై అత్యంత ప్రాధాన్యత ఇచ్చేలా చర్యలకు ఉపక్రమించారు. ఇవాల్టి నుంచి విహార యాత్ర తాత్కాలికంగా నిలిపివేసి బోట్లను తనిఖీలు చేస్తున్నారు. దేవీపట్నం మండలం గండి పోచమ్మ ఆలయం వద్ద - మిగతా3లో

# అనుమతులు లేకుండా ర్యాలీ నిర్వహణ..

**ఎమ్మెల్సీ భరత్‌తో పాటు 35 మంది వైసీపీ నేతలపై కేసులు నమోదు**

**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూన్ 15:**

చిత్తూరు జిల్లా కుప్పంలో అనుమతులు లేకుండా ర్యాలీ నిర్వహించిన ఘటనపై పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. ఈ నెల 12వ తేదీన ముందస్తు అనుమతులు పొందకుండా ర్యాలీ నిర్వహించినందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన 35 మంది నాయకులపై కేసులు నమోదు చేశారు. పోలీసుల సమాచారం ప్రకారం, ప్రజా శాంతిభద్రతలకు భంగం కలిగే అవకాశం ఉన్నప్పటికీ, సంబంధిత అధికారుల అనుమతి లేకుండా పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించడంతో పాటు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగే విధంగా వ్యవహరించినట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో భారతీయ న్యాయ సంహితలోని 223, 126(2), 132 చదవబడిన 3(5) సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఈ కేసులో ఎమ్మెల్సీ భరత్‌ను ప్రధాన నిందితుడిగా పేర్కొంటూ ఏ-1గా నమోదు చేసినట్లు తెలిసింది. ర్యాలీ నిర్వహణలో ప్రత్యక్షంగా పాల్గొన్న పలువురు నాయకులు, కార్యకర్తలను కూడా నిందితుల జాబితాలో చేర్చినట్లు సమాచారం. అనుమతి నిబంధనలను ఉల్లంఘిస్తూ రాజకీయ కార్యక్రమాలు నిర్వహించడం వల్ల ప్రజలకు ఇబ్బందులు కలగడంతో పాటు శాంతిభద్రతల సమస్యలు తలెత్తే అవకాశముందని పోలీసులు పేర్కొన్నారు. చట్టాన్ని ఎవరైనా ఉల్లంఘించినా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అలాగే ర్యాలీలో పాల్గొన్న మరికొందరి వివరాలను సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. వీడియో దృశ్యాలు, ఫోటోలు, ఇతర ఆధారాలను పరిశీలిస్తున్న పోలీసులు, విచారణ అనంతరం మరికొందరిపై కూడా కేసులు నమోదు చేసే అవకాశాలు ఉన్నాయని సమాచారం. ఈ ఘటన జిల్లాలో రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. పోలీసులు కేసు దర్యాప్తును కొనసాగిస్తూ, చట్టపరమైన చర్యలను ముందుకు తీసుకెళ్తున్నారు.

## పాతపేటలో ఎస్ఐఆర్ అవగాహన కార్యక్రమం

**అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలి: రాజ్‌కుమార్**




**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూన్ 15:**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై అవగాహన కల్పించేందుకు సోమవారం కుప్పం పట్టణంలోని పాతపేట ప్రాంతంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కాణిపాకం వెంకటేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కుప్పం నియోజకవర్గ అడ్వైజరీ కమిటీ సభ్యులు ఎస్. రాజ్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం చేపడుతున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావడంతో పాటు, ఇప్పటికే ఉన్న ఓటర్లు తమ వివరాలను సరిచూసుకొని అవసరమైతే సవరణలు చేయించుకోవాలని కోరారు. ఓటర్ల జాబితాలో పేర్లు లేని యువత, ఇటీవల 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న వారు తప్పనిసరిగా కొత్త ఓటరుగా నమోదు చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. అలాగే చిరునామా మార్పు, పేరు సవరణ, ఇతర వివరాల్లో మార్పులు ఉన్నవారు సంబంధిత అధికారులను సంప్రదించి తమ వివరాలను నవీకరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా నాయకులు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితాను పరిశీలించి ప్రజలకు ఎస్ఐఆర్ కార్యక్రమం ప్రాముఖ్యతను వివరించారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో ప్రతి పౌరుడి భాగస్వామ్యం అవసరమని, అందుకే ప్రతి అర్హుడూ ఓటరుగా నమోదు కావాలని నాయకులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, బూత్ ఇన్‌చార్జీలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతంగా సాగిందని పట్టణ టిడిపి అధ్యక్షులు కాణిపాకం వెంకటేష్ తెలిపారు.

## దలవాయి కొత్తపల్లిలో ఎస్ఐఆర్ జోరు

**అర్హులంతా ఓటరుగా నమోదు కావాలని టీడీపీ నేతల పిలుపు**



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూన్ 15:**

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్)లో భాగంగా కుప్పం పట్టణంలోని దలవాయి కొత్తపల్లి ప్రాంతంలో సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. యూనిట్ ఇన్‌చార్జి సుబ్రమణి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 12వ వార్డు అధ్యక్షులు ఇర్ఫాన్, కౌన్సిలర్ అభ్యర్థి రవి, స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు ఓటర్ల జాబితాను పరిశీలించి అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని ప్రజలకు సూచించారు. 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువత తప్పనిసరిగా ఓటరు జాబితాలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. అలాగే ఓటర్ల జాబితాలో పేర్లు లేకపోయిన వారు, వివరాల్లో మార్పులు ఉన్న వారు సంబంధిత అధికారులను సంప్రదించి సవరణలు చేయించుకోవాలని తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హ పౌరుడు ఓటరుగా నమోదు కావడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయవచ్చని నాయకులు పేర్కొన్నారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలిస్తూ ఎస్ఐఆర్ కార్యక్రమం ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, బూత్ ఇన్‌చార్జీలు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## న్యాయ సేవా కేంద్రాలను వినియోగించుకోవాలి: వరుణ్ తేజ్

**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూన్ 15:**

ఈశాన్య రాష్ట్రాల నుంచి ఆంధ్రప్రదేశ్‌కు, ముఖ్యంగా కుప్పం ప్రాంతానికి వలస వచ్చిన ప్రజలు ఉచిత న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కుప్పం మండల న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్ వరుణ్ తేజ్ పిలుపునిచ్చారు. రాష్ట్ర న్యాయ సేవా సంస్థ ఆదేశాల మేరకు సోమవారం కుప్పంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఉచిత న్యాయ సహాయ సేవా కేంద్రాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరికీ న్యాయం అందుబాటులో ఉండాలనే రాజ్యాంగ స్ఫూర్తితో ఈ సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. లీగల్ సర్వీసెస్ అథారిటీస్ చట్టం-- 1987 ప్రకారం పేదలు,బలహీన వర్గాలు, వలస కార్మికులు, ఇతర అర్హులైన వారికి ఉచిత న్యాయ సహాయం అందిస్తున్నట్లు వివరించారు. ముఖ్యంగా భాషా, ఆర్థిక, సామాజిక కారణాల వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఈశాన్య రాష్ట్రాల ప్రజల కు ప్రత్యేక సౌకర్యాలు కల్పించినట్లు పేర్కొన్నారు.అస్సాం, అరుణాచల్ ప్రదేశ్, మణిపూర్, మేఘాలయ, మిజోరాం, సిక్కిం, త్రిపుర రాష్ట్రాలకు చెందిన వలసదారులు ఈ సేవలను పొందవచ్చని తెలిపారు. ఉద్యోగాలు, వేతనాలు, కార్మిక హక్కులు, కుటుంబ వివాదాలు, అద్దె సమస్యలు, గుర్తింపు పత్రాలు, ఇతర న్యాయపరమైన అంశాలకు సంబంధించిన సమస్యలపై ఉచిత సలహాలు, న్యాయ సహాయం అందించనున్నట్లు చెప్పారు..న్యాయ సేవలు ప్రజలకు సులభంగా చేరేలా ప్రత్యేకంగా ప్యానెల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లను అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. అవసర మైన వారు న్యాయ సేవా కేంద్రాన్ని సంప్రదించి తమ సమస్యలను తెలియజే స్తే తగిన న్యాయ సహాయం అందించేం దుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. న్యాయం అందరికీ చేరువ కావాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని సంబంధిత ప్రజలు పూర్తిగా వినియోగించు కోవాలని సూచించారు. తమ హక్కుల పరిరక్షణ కోసం న్యాయ సహాయం పొందడంలో ఎలాంటి సంకోచం అవసరం లేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయ సేవా సంస్థ ప్రతినిధులు,ప్యానెల్ న్యాయ వాదులు,పారా లీగల్ వాలంటీర్లు, వలస కార్మికులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. వలసదారుల్లో న్యాయ అవగాహన పెంపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.

# వైసీపీ నాయకులు నోరు అదుపులో పెట్టుకోవాలి

**కుల రాజకీయాలు మానుకోవాలి: టీడీపీ వన్నియకుల క్షత్రియ నాయకులు**




**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూన్ 15:**

చిత్తూరు జిల్లా కుప్పం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో టీడీపీ వన్నియకుల క్షత్రియ నాయకులు జీఎంరాజు, రుద్రప్ప, సాంబశివం, మురళి, వెంకటేష్ మాట్లాడుతూ.. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులపై తీవ్ర విమర్శలు చేశారు. గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పాలనలో కుప్పంలో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటనలను అడ్డుకునేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. ప్రజల్లో విస్తృత ఆదరణ ఉన్న నాయకుడిని కుప్పంలో అడుగుపెట్టకుండా అడ్డుకునే ప్రయత్నాలు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు. అదే సమయంలో పోలీసులను అడ్డుపెట్టుకుని తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు నమోదు చేసి అరెస్టులు నిర్వహించారని ఆరోపించారు. రాజకీయ కక్షసాధింపు ధోరణితో వ్యవహరిస్తూ ప్రతిపక్ష నాయకులను వేధించడం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పాలనలో సాధారణ విషయంగా మారిందని విమర్శించారు. ప్రస్తుతం కూడా కొంతమంది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తూ రాజకీయ వాతావరణాన్ని కలుషితం చేసే ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. ప్రజల సమస్యలపై మాట్లాడకుండా వ్యక్తిగత విమర్శలు, అసభ్య వ్యాఖ్యలకు పాల్పడడం మానుకోవాలని సూచించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు నోరు అదుపులో పెట్టుకుని బాధ్యతాయుతంగా మాట్లాడాలని హెచ్చరించారు. రాజకీయాల్లో పరస్పర గౌరవం, సంయమనం అవసరమని, ప్రజలను తప్పుదోవ పట్టించే వ్యాఖ్యలు చేయడం సరికాదని తెలిపారు. కొంత మంది నాయకులు కులాన్ని అడ్డుపెట్టుకుని నీచ రాజకీయాలకు పాల్పడుతు న్నారని ఆరోపించారు. సమాజంలో విభేదాలు సృష్టించే ప్రయత్నాలను ప్రజలు గమనిస్తున్నారని, ఇటువంటి రాజకీయాలను ప్రజలు ఎప్పటికీ అంగీకరించరని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి, కుప్పం ప్రగతి కోసం తెలుగుదేశం పార్టీ కట్టుబడి పనిచేస్తోందని, రాజకీయ లబ్ధి కోసం సమాజాన్ని విభజించే ప్రయత్నాలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు నాయకులు స్పష్టం చేశారు. ఈ మీడియా సమావేశంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వద్దు..

**నిర్దేశిత గడువులో సమస్యలు పరిష్కరించాలి : జిల్లా ఎస్పీ తుషార్ డూడి**



**చిత్తూరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూన్ 15:**

ప్రజల సమస్యలకు త్వరితగతిన పరిష్కారం చూపి బాధితులకు న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడి పోలీసు అధికారులను ఆదేశించారు. ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను జిల్లా ఎస్పీ తుషార్ డూడి, నాన్ క్యాడర్ ఎస్పీ రాజశేఖర్ రాజు, చిత్తూరు ఉపవిభాగ పోలీసు అధికారి జె. వెంకటనారాయణకు వివరించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమంలో అందిన ప్రతి ఫిర్యాదును చట్ట ప్రకారం సమగ్రంగా విచారించి, నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులకు ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. ప్రజలు న్యాయం కోసం పోలీసు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రాకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజలు తమ సమస్యలపై న్యాయం పొందేలా నిబద్ధతతో పనిచేయడం పోలీసు శాఖ ప్రధాన బాధ్యత అని ఎస్పీ పేర్కొన్నారు. ప్రతి ఫిర్యాదును లోతుగా పరిశీలించి, త్వరితగతిన విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. పోలీసులు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి, చట్టబద్ధంగా వారి సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ఉందని స్పష్టం చేశారు.ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం, జాప్యానికి తావు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 37 ఫిర్యాదులు అందాయి. వాటిలో భూ తగాదాలకు సంబంధించినవి అత్యధికం గా 14 ఉండగా,చిన్న గొడవలకు సంబం ధించినవి 6,కుటుంబ తగాదాలకు సంబంధించినవి4, వేధింపులకు సంబంధించినవి 4, ఆస్తితగాదాలకు సంబంధించినవి4, మోసాలకు సంబంధించినవి2, డబ్బు లావాదేవీల తగాదాలకు సంబంధించినవి 2, భర్త వేధింపులకు సంబంధించిన ఒక ఫిర్యాదు నమోదైంది. అందిన ప్రతి ఫిర్యాదుపై సంబంధిత పోలీసు అధికారులు వెంటనే స్పందించి, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశించారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా పారదర్శకంగా, బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల పోలీసు అధికారులు, సిబ్బంది, ఫిర్యాదుదారులు పాల్గొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి జిల్లా పోలీసు శాఖ ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని అధికారులు తెలిపారు.

# 56 వినతుల స్వీకరణ..

**సమస్యల పరిష్కారంలో వేగం పెంచాలి : కడ పిడి వికాస్ మర్మత్**






**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్15:**

ప్రజల సమస్యలను సత్వరంగా పరిష్కరించి ప్రభుత్వ సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం కుప్పం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా మొత్తం 56 వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు.కార్యక్రమంలో కడ ప్రాజెక్టు డైరెక్టర్ వికాస్ మర్మత్, అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసులు రాజు పాల్గొని ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరించారు. వివిధ శాఖల డివిజనల్ స్థాయి అధికారులు హాజరై ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను విన్నారు.అందిన వినతుల్లో సర్వే, సెటిల్‌మెంట్లు, భూ రికార్డుల శాఖకు అత్యధికంగా 16, రెవెన్యూ శాఖకు 12, పెన్షన్లకు సంబంధించినవి 7, భూ సేకరణ శాఖకు 3 వినతులు అందాయి. పోలీసు, ప్రజారోగ్య, గృహ నిర్మాణ, మున్సిపాలిటీ శాఖలకు చెరో రెండు చొప్పున ఫిర్యాదులు నమోదయ్యాయి. అదే విధంగా పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్, వ్యవసాయ శాఖ, స్వర్ణ గ్రామ--స్వర్ణ వార్డు,గ్రామీణ నీటి సరఫరా, ఆంధ్రప్రదేశ్ దక్షిణ విద్యుత్ పంపిణీ సంస్థ, ఇరిగేషన్, సబ్ రిజిస్ట్రార్,రహదారులు--భవనాలు, అటవీ శాఖ,పౌర సరఫరాల శాఖలకు సంబంధించిన వినతులు కూడా అధికారులు స్వీకరించారు. అనంతరం నిర్వహించిన సమీక్ష సమావేశంలో కడ ప్రాజెక్టు డైరెక్టర్ వికాస్ మర్మత్ మాట్లాడుతూ.. ప్రజల నుంచి అందుతు న్న ప్రతి వినతిని అత్యంత ప్రాధాన్యంతో తీసుకుని నిర్ణీత గడువులోగా పరిష్కరిం చాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి రాకుండా చూడాలని సూచించారు. ప్రజాసమస్యల పరిష్కారంలో అధికారులు మరింత బాధ్యతతో వ్యవహరించాలని, ప్రభుత్వంపై ప్రజల్లో విశ్వాసం పెరిగేలా పనిచేయాలని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమపథకాలు, అభివృద్ధి కార్యక్రమాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా క్షేత్రస్థాయి లో ప్రత్యేక చొరవ చూపాలని సూచించారు. వివిధ శాఖల మధ్య సమన్వయంతో పనిచేసి పెండింగ్ లో ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యం, నిర్లక్ష్యానికి తావు లేకుండా అధికారులు పని చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు,సిబ్బంది, ప్రజాప్రతినిధులు, ఫిర్యాదుదారులు పాల్గొన్నారు.

# బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేద్దాం

**మన గ్రామాన్ని బాల కార్మిక రహిత గ్రామంగా తీర్చిదిద్దుతాం**



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్15:**

శ్రీకాళహస్తి ప్రపంచ బాల కార్మిక మాసోత్సవాలు సందర్భంగా ప్రగతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జరిగిన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముచ్చువోలు సచివాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిరంజీవి మాట్లాడుతూ మన గ్రామాన్ని బాల కార్మిక వ్యవస్థను నిర్మూ లించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేద్దాం అని పిలుపునిచ్చారు ప్రతి ఒక్కరిని పిల్లవాణ్ణి పాఠశాలలో చేర్పించేందుకు అందరూ వారి వంతు కృషి చేయాలన్నారు తల్లితండ్రులు తమ బిడ్డలను క్రమం తప్పక పాఠశాలకు పంపాలని కోరారు . ప్రభుత్వం అందిస్తున్న అన్ని సదుపాయాలు ఉపయోగించుకుని ఏ విద్యార్థి పాఠశాలకు నిలిచిపోకుండా బాల కార్మికుడిగా మారకుండా తమ వంతు సహకారం అందించాలని కోరారు. ప్రగతి స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు పిల్లల అందరూ పాఠశాలలో ఉండాలి వాళ్ల కార్మిక వ్యవస్థ హానికరం ఇళ్లల్లో దుకాణాల్లో వ్యవసాయం లేదా రోజు వారి కూలి పనులు పరిశ్రమల్లో ఎక్కడ ఏ విధమైన పనుల్లో పిల్లల్ని నియమించుకోరాదని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు . తల్లిదండ్రులు పిల్లల్ని చదువు మాన్పించరాదని విద్య యొక్క ప్రాముఖ్యతపై, పిల్లల హక్కులపై వారు అవగాహన కలిగి ఉండాలని కోరారు కుటుంబ స్థాయిలో అమ్మాయిలు పట్ల ఎలాంటి లింగ వివక్షతను చూపరాదన్నారు తల్లిదండ్రులు పిల్లలకు కొంత సమయం కేటాయించాలి వారి మాటలను అభిప్రాయాలను గౌరవించాలి తల్లిదండ్రులు బాల కార్మిక వ్యవస్థ వలన ఏర్పడే ఇబ్బందులు గురించి తెలుసుకోవాలి. తల్లిదండ్రులు వారి భావాలను పిల్లలపై రుద్దకూడదు అన్నారు. పిల్లలకు సమస్యలు ఏర్పడితే చైల్డ్ లైన్ 1098 కు సమాచారం ఇవ్వాలన్నారు పంచాయతీ కార్యదర్శి విజయ్ మాట్లాడుతూ పంచాయతీ స్థాయిలో బాల కార్మికులు ఏర్పడకుండా తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. ప్రజా ప్రతినిధులు నరసయ్య మురళీకృష్ణారెడ్డి అంగన్వాడీ టీచర్లు కళావతి రంగమ్మ సుబ్బమ్మ మాధవి ఆరోగ్య కార్యకర్త వాణిశ్రీ సచివాలయం ఆరోగ్య సూపర్వైజర్ నందిని స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ సభ్యులు ప్రగతి సంస్థకో కన్వీనర్ రామచంద్ర గ్రామ స్తులు తల్లిదండ్రులు పాల్గొన్నారు అనంతరం మా గ్రామంలో బాలకార్మిక వ్యవస్థను నిర్మూలిస్తామని ప్రతిజ్ఞ చేశారు.

చిత్తూరు ఎక్స్‌ప్రెస్
జాతీయ తెలుగు దినపత్రిక
APTEL/2024/86143



# పాపం షర్మిళ... ఏటీ చేద్దాం




**కడప :** వైయస్ షర్మిల తీవ్ర ఆగ్రహంతో ఉన్నారా? కాంగ్రెస్ పార్టీ తీరుపై ఆవేదనతో ఉన్నారా? తీవ్ర నిర్ణయం దిశగా అడుగులు వేస్తున్నారా? తనకు రాజ్యసభ పదవి ఇవ్వకపోవడంపై కొందరి హస్తం ఉందన్న అనుమానాలు ఆమెలో ఉన్నాయా? అందుకే ఇండియా కూటమి సమావేశానికి ఆమె గైర్హాజరయ్యారా? ఏపీ పొలిటికల్ సర్కిల్లో దీనిపైనే చర్చ నడుస్తోంది. కొద్ది రోజుల కిందట కర్ణాటక నుంచి రాజ్యసభకు షర్మిలను ఎంపిక చేస్తారన్న ప్రచారం జరిగిన సంగతి తెలిసిందే. ఆమెను ఢిల్లీ పిలిచి కాంగ్రెస్ అగ్ర నేతలు అభయం కూడా ఇచ్చారట. కానీ ఇంతలోనే సమీకరణలు మారిపోయాయి. చివరి నిమిషంలో షర్మిల పేరు లేకుండా పోయింది. అయితే కాంగ్రెస్ పార్టీ కోసం తాను నిలబడితే.. పార్టీ మాత్రం ఇచ్చిన మాట కట్టుబడి ఉండలేదన్న ఆవేదన షర్మిల లో ఉన్నట్లు తెలుస్తోంది. ఆ బాధతోనే రెండు రోజుల కిందట ఢిల్లీలో జరిగిన ఇండియా కూటమి సమావేశానికి ఆమె గైర్హాజరైనట్లు తెలుస్తోంది. 2024 ఎన్నికలకు ముందు ఏపీ కాంగ్రెస్ బాధ్యతలు తీసుకున్నారు షర్మిల. తెలంగాణలో తన తండ్రి పేరుతో పార్టీ ఏర్పాటు చేశారు. కానీ వర్కౌట్ కాకపోవడంతో కాంగ్రెస్ పార్టీలో విలీనం చేశారు తన పార్టీని. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఏదో ఒక నియోజకవర్గంలో నుంచి పోటీ చేయాలని భావించారు. అయితే ఏపీలో పార్టీ బాధ్యతలు తీసుకుంటే రాజ్యసభకు అవకాశం ఇస్తామని.. అది కూడా కర్ణాటక నుంచి ఛాన్స్ కల్పిస్తామని అప్పట్లో అగ్రనేతలు రాహుల్ గాంధీ, సోనియా గాంధీ హామీ ఇచ్చారు. అప్పటినుంచి కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఆమె కృషి చేస్తూ వచ్చారు. కర్ణాటక నుంచి రాజ్యసభ పదవులు ఖాళీ అయ్యాయి. అక్కడినుంచి ఛాన్స్ దక్కుతుందని భావించారు షర్మిల. అందుకు తగ్గట్టుగానే ఢిల్లీ నుంచి సమాచారం రావడంతో వెళ్లి వచ్చారు. నామినేషన్ వేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. కానీ చివరి నిమిషంలో కాంగ్రెస్ హై కమాండ్ హ్యాండిచ్చింది. అయితే ఏపీలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతల ద్వారానే.. తనకు రాజ్యసభ పదవి రాకుండా కుట్ర జరిగిందన్నది షర్మిల లో ఉన్న అనుమానం.ప్రధానంగా కర్ణాటక కాంగ్రెస్ నేతలతో వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డికి మంచి సంబంధాలు ఉన్నాయి. అందుకే ఆయన బెంగుళూరులో తన రాజకీయ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు అన్న ప్రచారం ఉంది. అయితే ఇప్పుడు అదే కర్ణాటక కాంగ్రెస్ నేతలతో కలిసి జగన్మోహన్ రెడ్డి తనకు రాజ్యసభ పదవి రాకుండా అడ్డుకున్నారన్న అనుమానం షర్మిల లో ఉంది. ఇదే విషయాన్ని పరోక్షంగా ఇటీవల ఆమె ఒక ట్వీట్ చేసినట్లు తెలుస్తోంది. పైగా జగన్మోహన్ రెడ్డిని మచ్చిక చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి అన్న అనుమానాలు కాంగ్రెస్ హై కమాండ్ పై ఉన్నాయి. ఈ అనుమానాలతోనే ఆమె కాంగ్రెస్ హై కమాండ్ పై రగిలిపోతున్నారు. అందుకే కీలకమైన ఇండియా కూటమికి గైర్హాజరయ్యారు. ఇదే పరిణామాలు కొనసాగితే షర్మిల తీవ్ర నిర్ణయం దిశగా అడుగులు వేసే అవకాశం ఉంది. చూడాలి మరి ఏం జరుగుతుందో..

# ఫీల్ గుడ్ తప్ప.. ఫీల్డ్ లో బ్యాడే

**గుంటూరు :** పల్నాడు జిల్లా నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు వ్యవహారం గురించి ప్రస్తుతం రకరకాల చర్చలు జరుగుతున్నాయి, కొందరికి కొత్త కొత్త డౌట్స్ వస్తున్నాయి. అసలు ఆయన్ని ఏ కోణంలో చూడాలంటూ పార్టీ వర్గాలే మాట్లాడుకుంటున్నాయి. పైకి మంచి అనిపిస్తున్నా కాస్త లోతుల్లోకి తొంగి చూస్తే ఎక్కడో ఏదో తేడా కొడుతోందని అనేవాళ్ళ సంఖ్య నియోజకవర్గంలోనే పెరిగిపోతోంది. ఈ పరిస్థితుల్లోనే తాజాగా టీడీపీ అధిష్టానం ఐవీఆర్ఎస్ సర్వే నిర్వహించి ఎంపీ పనితీరుకు సంబంధించిన ప్రశ్నలు సంధించడం కలకలం రేపుతోంది. 2019లో తొలిసారి నరసరావుపేట నుంచి వైసీపీ తరపున గెలిచారు లావు. 2024 ఎన్నికల్లో మరోసారి అక్కడి నుంచే బరిలో దిగాలని అనుకున్నా గుంటూరు పంపాలని నిర్ణయించింది అధిష్టానం. ఆ క్రమంలోనే వైసీపీకి రాజీనామా చేసి కొన్నాళ్ళ తర్వాత టీడీపీ కండువా కప్పుకున్నారాయన. రెండోసారి సైకిల్ గుర్తు మీద నరసరావుపేట ఎంపీగా పోటీ చేసి విజయం సాధించారు. ప్రస్తుతం ఈ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో అందరూ టీడీపీ ఎమ్మెల్యేలే ఉన్నారు. మొదట్లో అంతా బాగానే ఉన్నా? మెల్లిగా పదవుల పంపకాల్లో శ్రీకృష్ణదేవరాయులుతో పాటు టీడీపీలో చేరిన వారికి ప్రాధాన్యత లభిస్తోందంటూ వివాదం మొదలైంది. వినుకొండకు చెందిన మక్కెన మల్లిఖార్జునరావుకు జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ పదవి దక్కడం వెనక ఎంపీ చొరవ ఉందని పార్టీలో ప్రచారం జరిగింది. అలాగే?లావుతో పాటు టీడీపీలోకి వచ్చిన మాజీ ఎమ్మెల్యే జంగా కృష్ణమూర్తికి టీటీడీ బోర్డు మెంబర్‌గా అవకాశం లభించింది. ఎంపీ పరపతిని గట్టిగా వాడటం వల్లే వాళ్ళకు పదవులు వచ్చాయన్న టాక్ గట్టిగా నడిచింది పల్నాడు టీడీపీలో. అటు లోక్‌సభలో టీడీపీ ఫ్లోర్ లీడర్‌గా ఎంపీకి టీడీపీ అధిష్టానం కూడా ప్రాధాన్యం ఇచ్చింది.అదంతా ఒక ఎత్తయితే శ్రీకృష్ణ దేవరాయలు పార్టీలో గ్రూప్స్‌ని ప్రోత్సహిస్తున్నారన్న అభిప్రాయం బలపడుతోంది. ఇదే ఇప్పుడు సమస్యగా మారుతోందట. గతంలో వైసీపీ ఎంపీగా ఉన్నప్పుడు కూడా ఆయన గ్రూపులు ప్రోత్సహించారన్న ఆరోపణలున్నాయి. టీడీపీలో కూడా అదే ట్రెండ్ కొనసాగిస్తున్నారంటూ లోకల్‌గా పార్టీలో అసహనం వ్యక్తం అవుతోంది. పల్నాడు జిల్లా కేంద్రమైన నర్సరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబుతో ఎంపీకి పొసగడం లేదని చెప్పుకుంటున్నారు. ఎంపీతో సన్నిహితంగా ఉంటాడని పేరున్న నర్సరావుపేట జనసేన నేత తరచూ తమనేతను టార్గెట్ చేస్తూ ఆరోపణల డోస్ పెంచడమే ఇందుకు నిదర్శనం అంటున్నారు ఎమ్మెల్యే వర్గీయులు. లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని మిగతా ఎమ్మెల్యేలతో ఇప్పటికిప్పుడు విబేధాలు బయటపడకున్నా?అంతర్గతంగా ఏదో నడుస్తోందన్నది ఇంటర్నల్ టాక్. లావు తనతోపాటు వచ్చిన వారికి ప్రాధాన్యత ఇవ్వడం టీడీపీలో కొంతమంది సీనియర్లకు ఇష్టం లేదట. నియోజకవర్గాల్లో తమ ప్రాధాన్యత తగ్గకుండా చూసుకోవా లన్న టార్గెట్‌తో? ముందు జాగ్రత్తగా ఎంపీ వర్గీయులకు చెక్ పెట్టేలా ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలోనే? తాజాగా ఎంపీ పనితీరు ఎలా ఉందంటూ నియోజకవర్గంలో చాలా మందికి ఐవీఆర్ఎస్ కాల్స్ వచ్చాయి. లావుకు పార్టీలో అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని చెప్పుకుంటున్న టైంలో? ఆయన పనితీరు గురించి టీడీపీ అధిష్టానం సర్వే నిర్వహించడం ప్రాధాన్యం సంతరించుకుంది. శ్రీకృష్ణదేవరాయలు వ్యవహారశైలి గురించి పార్టీ పెద్దలకు ఫిర్యాదులు వెళ్ళడం వల్లే ఈ సర్వే నిర్వహించారా అన్న సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ఎంపీ తీరు నచ్చని కొంతమంది నేతలైతే. అవును, నిజమే?. అందుకే సర్వే చేశారంటూ బల్ల గుద్దుతున్నారు. మొత్తం మీద నరసరావుపేట టీడీపీలో ఇప్పుడు ఐవీఐర్ఎస్ ప్రకంపనలు రేగుతున్నాయి.

# మాజీ ఐపీఎస్ వర్సెస్ మాజీ ఎంపీ...
# రసకందాయంలో రాజకీయం

**రాజమండ్రి :** ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు చెందిన సీనియర్ ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్‌పై మాజీ ఎంపీ హర్ష కుమార్ సంచలన ఆరోపణలు చేశారు. ఆర్ఎస్ఎస్ సమావేశానికి ఒక్క పీవీ సునీల్ కుమార్‌కు మాత్రమే ఎందుకు ఆహ్వానం వచ్చిందని ఆయన ప్రశ్నించారు. అందువల్లే ఆయన్ను ప్రభుత్వం అరెస్ట్ చేయలేక పోతుందేమోనని, ఆయన ఎక్కడ మీటింగ్ పెట్టినా ప్రభుత్వం అనుమతులు ఇస్తుందని అనుమానాలు వ్యక్తం చేశారు.గతంలో ఆర్ఎస్ఎస్ సమావేశానికి హాజరై.. అక్కడ తాను గ్రహించిన విషయాలను ఫిబ్రవరి 10న పీవీ సునీల్ కుమార్ ఫేస్ బుక్‌లో పోస్టు చేశారు. ఆ పోస్టు స్క్రీన్ షాట్‌ను సోషల్ మీడియాలో పోస్టు చేసిన హర్ష కుమార్.. ఆయన ఆర్ఎస్ఎస్ అని అర్థమైపోతుందన్నారు. అనంతరం ఫేస్ బుక్‌లో వీడియో పోస్టు చేసిన హర్ష కుమార్.. ముందు జాగ్రత్తగా జాతిని హెచ్చరిస్తూ తాను ఈ పోస్టు చేశానన్నారు."పీవీ సునీల్ నాకు బాగా తెలిసినాయనే. నేను ఎంపీగా ఉన్నప్పుడు ఆయన ఒకసారి నా దగ్గరికి వచ్చారు. గుంటూరు ఐజీ ఖాళీగా ఉందని, వేయించమని కోరారు. నేను సీఎంతో మాట్లాడి వేయించాను. వేయించలేదని బైబిల్ పట్టుకొని ప్రమాణం చేయమని సునీల్ కుమార్‌ను చెప్పమనండి. తర్వాత మా మధ్య సంబంధాలు లేవు. రఘురామకృష్ణను కొట్టినప్పుడు.. అది తప్పు కాబట్టి నేను రఘురామ వైపు మాట్లాడి .. సునీల్ కుమార్ తీరును తప్పుబట్టాను. పీవీ సునీల్ కుమార్ ఆర్ఎస్ఎస్ గురించి చేసిన పోస్టును ఎవరో నాకు పంపించారు. బౌద్ధ ఆచారాల ప్రకారం సునీల్ కుమార్ తండ్రి అంత్యక్రియలు నిర్వహించారని నాతో ఒకరు చెప్పారు. దీంతో చింతలపూడిలో నాకు తెలిసిన వాళ్లకు ఫోన్ చేసి అడిగితే.. బౌద్ధ సంప్రదాయం ప్రకారం సునీల్ తండ్రి అంత్యక్రియలు చేసిన మాట నిజమేనని చెప్పారు. ఆర్ఎస్ఎస్ ఇతణ్ని ప్రమోట్ చేస్తుందనే అనుమానం వచ్చేలా నాకు చాలా పోకడలు కనిపించాయి. అందుకే జాతిని ముందే



మేల్కొలపాలనే ఉద్దేశంతోనే ఈ పోస్టు పెట్టాను. సునీల్ కుమార్ తన భార్యను హింసించడంతో ఆమె కేసు పెట్టింది. ఆయనపై ఆర్ఆర్ఆర్‌వి కాకుండా చాలా కేసులు ఉన్నాయి' అని హర్ష కుమార్ వ్యాఖ్యానించారు.మాజీ ఎంపీ హర్ష కుమార్ చేసిన పోస్టు పట్ల సునీల్ కుమార్ పరోక్షంగా స్పందించారు. 'పైకి ట్రిపుల్ ఆర్ (రఘురామ కృష్ణరాజు)తో పోరాడుతున్నట్లు నటిస్తూ.. అతని ఏజెంట్లుగా పని చేస్తున్నవాళ్లు దొరికిపోతున్నారు. వీళ్లను ఏం చేయాలో జాతికి తెలుసు' అని సునీల్ కుమార్ ఫేస్‌బుక్‌లో పోస్టు చేశారు.ఈ పోస్టు కింద సునీల్ కుమార్ అభిమానులు చేస్తున్న కామెంట్స్‌ను బట్టి ఆయన చేసిన ఈ పోస్టు హర్ష కుమార్‌ను ఉద్దేశించేదనని అర్థమవుతోంది. 'కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రణబ్ ముఖర్జీ లాంటి పెద్ద పెద్ద లీడర్లు సైతం ఆర్ఎస్ఎస్ ఆహ్వానం మేరకు ఆర్ఎస్ఎస్ సభలకు హాజరయ్యారని.. అంత మాత్రాన ప్రణబ్ ముఖర్జీ బీజేపీ మనిషి అయ్యారా? అప్పుడు హర్ష కుమార్ కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నారు. వారిని విమర్శించలేని హర్ష కుమార్ గత చరిత్ర మరచి పీవీ సునీల్ గారి మీద బురద జల్లుతున్నారు. హర్ష కుమార్, ఆయన కుమారుడి రాజకీయ పీఠాలు కదులుతాయని భయమా? లేదా ఆర్ఆర్ఆర్‌కు కోవర్టులుగా పని చేస్తున్నారా?' అని ప్రభుదాస్ అనే వ్యక్తి పీవీ సునీల్ కుమార్ పోస్టు కింద కామెంట్ చేశారు.పీవీ సునీల్ కుమార్ ఇటీవల భీమవరం సభలో మాట్లాడుతూ.. చర్చికి వెళ్లినంత మాత్రాన, ఇంట్లో బైబిల్ ఉన్నంత మాత్రం క్రిస్టియన్లు కారని.. బాప్టిజం తీసుకున్న వారే క్రైస్తవులు అవుతారని వ్యాఖ్యానించారు. తన తండ్రి అంత్యక్రియలను క్రైస్తవ పద్ధతిలోనే చేశానని.. దమ్ముంటే తన ఎస్సీ సర్టిఫికెట్ రద్దు చేయాలని సవాల్ చేశారు. ఈ మీటింగ్ సక్సెస్ కావడంతో రఘురామ కోవర్టులు ఒక్కొక్కరుగా బయటకు వస్తున్నారని ఆయన ఫేస్‌బుక్‌లో పోస్టు చేశారు.

## ప్రాజెక్టుల ఏర్పాటు ఇదే సరైన సమయం

-మొదటిపేజీ తరువాయి

నుంచి 2 శాతం మాత్రమేఅని ఒకప్పుడు హేళన చేసేవాళ్లు ఇప్పుడు పరిస్థితి మారిందని, ఏ రంగంలో పెట్టుబడులకు అయినా భారతదేశం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. పాలసీలు, సాంకేతిక నిపుణులు, అవసరమైన ఎకో సిస్టంతో ప్రధాని దేశాన్ని పెట్టుబడులకు సిద్ధంగా ఉంచారన్నారు. అతిపెద్ద యువశక్తి కలిగిన భారత్: ప్రస్తుతం 5వ జనరేషన్ యుద్ధ విమానాల తయారీ సహా ఇతర ఉత్పత్తులు వస్తున్నాయన్నారు. డెమోగ్రాఫిక్ డివిడెంట్‌తో అతిపెద్ద యువశక్తి కలిగిన మానవ వనరులను భారత్ కలిగి ఉందని అన్నారు. తయారీ రంగాన్ని ప్రోత్సహించేలా ఆంధ్రప్రదేశ్‌లో తాము వన్ ఫ్యామిలీ వన్ ఎంట్రప్రెన్యూర్ అనే విధానాన్ని అనుసరిస్తున్నామని సీఎం చంద్రబాబు వివరించారు. భూ సమీకరణ అనే కొత్త విధానం ద్వారా ప్రాజెక్టులకు భూములు ఇస్తున్నామన్నారు.

అమరావతి రాజధాని ఈ ప్రాతిపదికనే నిర్మిస్తున్నామన్నారు. ఆమ్కా, గూగుల్, ఆర్సెలార్ మిట్టల్ లాంటి పరిశ్రమలకు వేగంగా అనుమతులు ఇచ్చి భూములు కేటాయించామని తెలిపారు. వివిధ పారిశ్రామిక ప్రాజెక్టులు ఏర్పాటు చేసేందుకు ఇదే సరైన సమయమన్న చంద్రబాబు, పెట్టుబడిదారులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

ఆవిష్కరణల్ని ప్రోత్సహించాలని పిలుపు: శ్రీసిటీ లాంటి ప్రత్యేక పారిశ్రామిక వాడలు పెద్ద ఎత్తున పెట్టుబడుల్ని ఆకర్షిస్తున్నాయన్నారు. పౌర సేవలతో పాటు అన్ని అంశాలకూ టెక్నాలజీని అనుసంధానించామన్నారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా పెట్టుబడులకు ఆస్కారం ఉందని తెలిపారు. వెంచర్ కాపిటలిస్టులు ఆ సంస్థ తయారు చేసిన స్టార్టప్‌లకు పెట్టుబడులు అందించే అవకాశం ఉందని అన్నారు. అత్యుత్తమ ఆవిష్కరణల్ని ప్రోత్సహించేందుకు వెంచర్ కాపిటలిస్టులు ముందుకు రావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. "శ్రీసిటీ లాంటి ప్రత్యేక పారిశ్రామిక వాడలు పెద్ద ఎత్తున పెట్టుబడుల్ని ఆకర్షిస్తున్నాయి. పౌర సేవలతో పాటు అన్ని అంశాలకూ టెక్నాలజీని అనుసంధానించాం. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా పెట్టుబడులకు ఆస్కారం ఉంది. వెంచర్ కాపిటలిస్టులు ఆ సంస్థ తయారు చేసిన స్టార్టప్‌లకు పెట్టుబడులు అందించే అవకాశముంది. భారత్ సంస్కరణలతో దూసుకుపోతున్న అతి పెద్ద ఆర్థికశక్తి. అత్యుత్తమ ఆవిష్కరణల్ని ప్రోత్సహించేందుకు వెంచర్ కాపిటలిస్టులు ముందుకు రావాలి"–చంద్రబాబు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి

## అమరవీరులను గుర్తించేందుకు
## 12 సంవత్సరాలు సరిపోలేదా?

-మొదటిపేజీ తరువాయి

నిర్వహించిన సమావేశంలో పవన్ మాట్లాడారు. తెలంగాణ అమరవీరులకు నివాళు లర్పించేందుకు బయల్దేరితే రాష్ట్ర ప్రభుత్వం పర్మిషన్ ఇవ్వలేదని పవన్ కల్యాణ్ ఆరోపించారు. ఇండియా గేట్‌కు వెళ్లి సైనికులకు వందనం చేయాలంటే కశ్మీర్, పంజాబ్‌లో పుట్టాలా? అని ప్రశ్నించారు. తనకు స్ఫూర్తినిచ్చిన నేల తెలంగాణ అని స్పష్టం చేశారు. ప్రత్యేక రాష్ట్రం కోసం 1200 మంది అమరులయ్యారని గుర్తు చేశారు. ఒక నేల కోసం ఇంతలా ఆత్మబలిదానాలు చేసుకుంటారా? అనిపించిందని, అందుకే వారంటే తనకు గౌరవమని తెలిపారు. యువతను బలిచేసి నేతలు గద్దెనెక్కారని అన్నారు. అమరవీరులను గుర్తించేందుకు 12 సంవత్సరాల సరిపోలేదా? ప్రశ్నించారు. ఏ ఆశయాల కోసం తెలంగాణ వచ్చిందో దాని కోసం జనసేన తన వంతు కృషి చేస్తుందని మనస్ఫూర్తిగా మాటిస్తున్నానని హామీ ఇచ్చారు. పార్టీకి మంచి భవిష్యత్తు ఉంటుందని నేతలు, కార్యకర్తలు నిలబడాలని కోరారు. జాతీయ సమగ్రత కోసం సేన ప్రస్థానం' పేరిట ఢిల్లీలో జనసేన పార్టీ సమావేశం నిర్వహిస్తోంది. ఈ సమావేశంలో జనసేనాని పవన్ కల్యాణ్ జాతీయ సమైక్యతపై పార్టీ నేతలు శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. జాతీయ సమగ్రత, దేశభక్తి జనసేనకు కీలకాంశాలు పవన్ స్పష్టం చేశారు. జనసేన ద్వారా దేశ సమగ్రతా స్ఫూర్తిని తీసుకెళ్లడమే లక్ష్యంగా పని చేయాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

**ఢిల్లీకి రాగానే వెనక్కి తగ్గుతారు**

ప్రాంతీయతను విస్మరించని జాతీయవాదాన్ని చాటాలంటే ఢిల్లీనే సరైన ప్రాంతమని వివరించారు. కేంద్రం మెడలు వంచుతామంటూ మాట్లాడే నేతలు, వాస్తవానికి అలాంటి నేతలు ఢిల్లీకి రాగానే వెనక్కి తగ్గుతారని, ఢిల్లీకి వచ్చాక మెత్తబడిపోతారని పవన్ వ్యాఖ్యానించారు. అది దేశ రాజధాని విశిష్టత అన్న ఆయన దేశ సమగ్రతను దెబ్బతీసేందుకు కొన్ని శక్తులు ఎప్పుడూ సిద్ధమవుతుంటాయని కాక్రోచ్ పార్టీని ఉద్దేశించి వ్యాఖ్యలు చేశారు. ఇలాంటి వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని పార్టీ శ్రేణులకు సూచించారు. యువత ఆకాంక్షలకు అనుగుణంగా పని చేయాలని దిశానిర్దేశం చేశారు.

"తెలంగాణ ఏర్పాటుకు ఏనాడూ జనసేన అడ్డు చెప్పలేదు. ఏపీని విభజించిన తీరుపై మాత్రమే ఆవేదన వెలిబుచ్చాం. రాష్ట్రాన్ని విభజించిన నాటి నుంచి ఇవాళ్టికి కాంగ్రెస్ ధోరణి మారలేదు. కాంగ్రెస్ విభజన తీరు అసంతృప్తిని, అశాంతిని సృష్టించింది. ఇవాళ్టికి వారసత్వ సమస్యలు, ఆస్తుల పంపిణీ వంటివి అలానే ఉన్నాయి. తెలంగాణలో జనసేన సభకు అనుమతివ్వకుండా అడ్డుకున్న పరిస్థితి. ఢిల్లీ మెడలు వంచుతాం. తడాఖా చూపిస్తామని చాలామంది పెద్దమాటలు చెబుతారు. వాస్తవానికి అలాంటి నేతలు ఢిల్లీకి రాగానే వెనక్కి తగ్గుతారు. ప్రతి వ్యక్తి కూడా సమాజంలో మార్పు తేవొచ్చు. ఈమధ్య కాక్రోచ్ పార్టీ ఎలా పుట్టుకొచ్చిందో చూస్తున్నాం. కాక్రోచ్ పార్టీని చూస్తే చలిచీమల పద్యం గుర్తుకువచ్చింది. చలిచీమలు కూడా బలమైన పామును చంపేస్తాయి" – పవన్ కల్యాణ్, ఏపీ ఉపముఖ్యమంత్రి

## పాపికొండల్లో పర్యాటకుల
## భద్రత కోసం ప్రభుత్వం చర్యలు

-మొదటిపేజీ తరువాయి




బోట్లను ఆర్డీవో స్వాతి తనిఖీలు చేశారు. ఇటీవల సాంకేతిక కారణాలతో నదిలో నిలిచిన బోట్లను పరిశీలించారు. శుక్రవారం పర్యాటకులతో బయలుదేరిన శ్రీలక్ష్మి బోటు మధ్యలో నిలిచిపోవడంపై ఆరా తీశారు. కారణాలు తెలుసుకుని మరమ్మతులకు ఆదేశించారు. గండి పోచమ్మ బోటింగ్ పాయింట్ వద్ద సౌకర్యాలను పరిశీలించిన ఆర్డీవో స్వాతి, సదుపాయాలు పెంచేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బోటు యజమానులు, పర్యాటక శాఖ అధికారులతో సమావేశమై ప్రయాణికుల భద్రత కోసం తీసుకోవాల్సిన చర్యలపై ఆదేశాలు జారీ చేశారు. అన్ని బోట్ల ఫిట్ నెస్‌ను తనిఖీ చేసి సరిగ్గా ఉన్నాకే నదిలో విహారానికి అనుమతివ్వాలని ఆర్డీవో స్వాతి ఆదేశించారు. ప్రతి బోటుకూ ఫిట్ నెస్ ధృవపత్రం తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని నిర్దేశించారు. తనిఖీలు పూర్తయ్యే వరకు గోదావరి విహారానికి ఎట్టి పరిస్థితుల్లో అనుమతించవద్దని స్పష్టం చేశారు. దేవీపట్నం నుంచి రోజూ 1 పర్యాటక బోటు, 15 ప్రైవేటు బోట్లు రాకపోకలు చేస్తుండగా వాటన్నింటినీ సమగ్రంగా తనిఖీలు చేసి ఫిట్ నెస్ ధృవపత్రం ఇచ్చాకే విహారానికి అనుమతివ్వాలని స్పష్టం చేశారు.

**బోట్ల నిర్వహణపై భద్రతాపరమైన ఆందోళనలు**

గోదావరి నదిలో పర్యాటక బోట్ల నిర్వహణపై భద్రతాపరమైన ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యలుగా పాపికొండలకు వెళ్లే పర్యాటక బోట్ల రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు రంపచోడవరం ఆర్డీవో స్వాతి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల దేవీపట్నం మండలంలోని గండిపోశమ్మ అమ్మవారి ఆలయం నుంచి ఒక బోటులో దాదాపు 89 మంది వరకు పర్యాటకులు పాపికొండల విహారయాత్రకు వెళ్లారు.

**నిబంధనల ఉల్లంఘిస్తే కఠిన చర్యలు**

అయితే ఈ క్రమంలో దేవీపట్నం పాత పోలీసుస్టేషన్ ప్రాంతానికి వారు వెళ్లేసరికి సాంకేతిక లోపం ఏర్పడింది. దాంతో అప్రమత్తమైన సరంగు బోటును నిలిపివేశారు. దీనిపై మీడియాలో పలు కథనాలు సైతం రావడం గమనార్హం. దాంతో కలెక్టర్ ఆదేశాల మేరకు బోట్ల ఫిట్‌నెస్, భద్రతా ప్రమాణాలపై సమగ్రంగా అధికారులు పరిశీలన చేయిస్తున్నారు. అందుకుగాను వీటిపై నివేదిక వచ్చిన తర్వాతే బోట్లకు అనుమతులను ఇస్తామని ఆర్డీవో ఈ సందర్భంగా తెలిపారు. అలా కాకుండా ఎవరైనా నిబంధనల ఉల్లంఘనకు పాల్పడినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## విద్యార్థి మిత్రకెట్లను సరఫరా చేయాలి ఎస్ఎఫ్ఐ

**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్15:**



శ్రీకాళహస్తి నియోజకవర్గ వ్యాప్తంగా ప్రభుత్వబడుల్లో విద్యనభ్యసించే పేద విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం సత్వరమే విద్యా మిత్ర కిట్లను పూర్తి స్థాయిలో సరఫరా చేయాలని ఎస్ఎఫ్ఐ శ్రీకాళహస్తి ప్రాంతీయ కార్యదర్శి చుట్టు గురవయ్య విజ్ఞప్తి చేశారు. ఎస్ఎఫ్ఐ నేతలు సోమవారం పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, బాబూ అగ్రహారం మున్సిపల్ ఉన్నత పాఠశాలలను తనిఖీ చేశారు. పూర్తి స్థాయిలో విద్యామిత్ర కిట్లు పంపిణీ చేయక పోవడంపై అసంతృప్తిని వ్యక్తం చేశారు. కేవలం పాఠ్య పుస్తకాలు,నోటు పుస్తకాలు మాత్రమే 50 శాతం మేర పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా యూనీఫామ్, బెల్టు, షూల సరఫరాకు మరో నెల రోజుల సమయం పట్టే పరిస్థితి ఉందనీ, ప్రభుత్వం వెంటనే స్పందించాలని సూచించారు. అదేవిధంగా మధ్యాహ్న భోజన కార్మికుల పొట్ట కొట్టే స్మార్ట్ కిచెన్ లకు వ్యతిరేకంగా ప్రజలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తిరగబడాలని పిలుపునిచ్చారు. ఇస్కాన్ లాంటి సంస్థలకు స్మార్ట్ కిచెన్ వ్యవస్థ అందిస్తే పేద విద్యార్థులకు పౌష్టికాహారం అందడంకల్లేనని స్పష్టంచేశారు. గంగాధర్,భువనేష్, గురవయ్య పాల్గొన్నారు.

## కమ్మకొత్తూరు శ్మశాన సమస్యను పరిష్కరించండి




**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్15:**

శ్రీకాళహస్తి రూరల్ మండలంలోని కమ్మకొత్తూరు గ్రామానికి అనాదిగా ఉన్న శ్మశాన సమస్యను పరిష్కరించాలని సీపీఎం శ్రీకాళహస్తి ప్రాంతీయ కార్యదర్శి గంధం మణి విజ్ఞప్తి చేశారు. స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద కమ్మ కొత్తూరు గ్రామ ప్రజలతో కలిసి కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన చేపట్టారు వీరికి మద్దతు తెలిపిన అనంతరం గంధం మణి మాట్లాడుతూ దేశానికి స్వాతంత్రం సిద్ధించి 80 ఏళ్ళు కావస్తున్నా నేటికీ దళితవాడలు శ్మశానాలకు నోచలేదని వాపోయారు. కమ్మకొత్తూరు గ్రామం ఏర్పడి 150 ఏళ్ళు దాటిపోతున్నా శ్మశాన స్థలం, దారి లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సుమారు 200 కుటుంబాల వారు అంత్యక్రియల సందర్భంగా అంతిమ కష్టాలు పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే ఎస్సీ సబ్ ప్లాన్ నిధుల కింద స్థలాన్ని సమీకరించి,అన్ని రకాల మౌలిక వసతులు మెరుగుపర్చాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయ ఏవోకు వినతిపత్రం అందజేశారు. కేవీపీఎస్ నాయకులు అంగేరి పుల్లయ్య, పెనగడం గురవయ్య, బాలగురవయ్య, కృష్ణయ్య,టీ.గురవయ్య, గురునాధం, రాజా, సుబ్రమణ్యం, గున్నయ్య, శివప్రసాద్, హరేరామయ్య,రమేష్ పాల్గొన్నారు.

## ఉత్తమ ఫలితాలు సాధించాలి జడ్పిటిసి వెంకటసుబ్బారెడ్డి



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 15:**

శ్రీకాళహస్తి విద్యార్థులు బాధ్యతగా చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని జడ్పిటిసి సభ్యులు వెంకటసుబ్బారెడ్డి అన్నారు. పట్టణంలోని ఆర్ పి బి ఎస్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జడ్పిటిసి సభ్యులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యాభివృద్ధికి విశేష కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఉన్నత విద్యావంతుడైన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని పాఠశాలలో మెరుగైన వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులకు విద్యార్థి మిత్ర కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి అంబటి బాలయ్య, ప్రధానోపాధ్యాయులు తీగల వెంకటయ్య, ఉపాధ్యాయులు భాను ప్రకాష్, రమేష్‌రెడ్డి, వరలక్ష్మి, సీఆర్ఎంటి మునిమోహన్, అనిల్ పాల్గొన్నారు.

## ఉత్తమ ఫలితాలు సాధించాలి : జడ్పిటిసి వెంకటసుబ్బారెడ్డి



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్15:**

శ్రీకాళహస్తి విద్యార్థులు బాధ్యతగా చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని జడ్పిటిసి సభ్యులు వెంకటసుబ్బారెడ్డి అన్నారు. పట్టణంలోని ఆర్ పి బి ఎస్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జడ్పిటిసి సభ్యులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యాభివృద్ధికి విశేష కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఉన్నత విద్యావంతుడైన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని పాఠశాలలో మెరుగైన వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులకు విద్యార్థి మిత్ర కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి అంబటి బాలయ్య, ప్రధానోపాధ్యాయులు తీగల వెంకటయ్య, ఉపాధ్యాయులు భాను ప్రకాష్, రమేష్ రెడ్డి,వరలక్ష్మి, సీఆర్ ఎంటి మునిమోహన్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

చదవండి..
చదివించండి
చిత్తూరు ఎక్స్‌ప్రెస్

## సమగ్ర ప్రత్యేక సవరణ కార్యక్రమం



**శ్రీకాళహస్తి,చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్15:**

శ్రీకాళహస్తి సోమవారం నుంచి ప్రారంభమైన ఓటరు జాబితా సమగ్ర ప్రత్యేక సవరణ సర్ కార్యక్రమాన్ని విజయవంతంగా కొనసాగించాలంటూ శ్రీకాళహస్తిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు కూటమి నాయకులు పార్టీ నాయకులు కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. దేశవ్యాప్తంగా చేపట్టనున్న ఓటరు జాబితా సమగ్ర ప్రత్యేక సవరణ సర్ కార్యక్రమాన్ని బిఎల్వో సోమవారం నుంచి చేపట్టనున్నారని కూటమి నాయకులు కూడా బీఎల్వో వేళలతో కలిసి ఇంటింటికి వెళ్లి సమగ్రహ ఓటరు జాబితా తయారు చేసే విధంగా కార్యాచరణ చేపట్టాలని ఈ సందర్భంగా కార్యకర్తలను నాయకులను కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు కోల ఆనంద్, జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయ కార్యకర్త , బిజెపి తిరుపతి జిల్లా మాజీ అధ్యక్షులు డాక్టర్ చంద్రప్ప, శ్రీకాళహస్తి దేవస్థానం పాలకమండలి చైర్మన్ కొట్టేసాయి , తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## హెచ్ పివి టీకా గడువు మరో 3 నెలలు పొడిగింపు

### అర్హులైన బాలికలు సద్వినియోగం చేసుకోవాలి..

### హెల్త్ సూపర్వైజర్ కామరాజు



**రేణిగుంట, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూన్15:**

గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణకు చేపట్టిన హెచ్ పివి టీకా కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం మరో మూడు నెలలు పొడిగించినట్లు హెల్త్ సూపర్వైజర్ కామరాజు తెలిపారు. 14 సంవత్సరాలు పూర్తి చేసి 15 సంవత్సరాలు నిండని బాలికలు ఈ అవకాశాన్ని వినియోగించుకొని టీకా వేయించుకోవాలని కోరారు.రేణిగుంట ప్రభుత్వ బాలికల పాఠశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతూ...టీకా పూర్తిగా సురక్షిత మైందని, ఎలాంటి భయాందోళనలు అవసరం లేదన్నారు. రేణిగుంట మండలంలో అర్హులైన 410 మంది బాలికల్లో ఇప్పటివరకు 355 మందికి టీకాలు అందించి 87 శాతం లక్ష్యాన్ని సాధించినట్లు వెల్లడించారు. విద్యాసంస్థలు పునఃప్రారంభమైన నేపథ్యంలో మిగిలిన బాలికలకు ఆగస్టు నెలలోగా టీకా పంపిణీ పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు ఎటువంటి రియాక్షన్ కేసులు నమోదు కాలేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని శ్యామల, వైద్య సిబ్బంది,ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయులు,విద్యార్థినులు పాల్గొన్నారు.

## రేణిగుంటలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

**రేణిగుంట,చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్15:**



రేణిగుంట పట్టణపరిధిలోని వేణుగోపాలపురం ప్రాంతంలో ఉన్న ఓ ఖాళీ స్థలంలో సోమవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం, మృతుడి వయస్సు సుమారు 40 నుంచి 45 సంవత్సరాల మధ్య ఉండవచ్చని అంచనా. ప్రాథమిక పరిశీలనలో అతని శరీరంపై ఎలాంటి బాహ్య గాయాలు కనిపించలేదని పేర్కొన్నారు. అనారోగ్యం, వడదెబ్బ లేదా ఇతర సహజ కారణాల వల్ల మృతి చెందిన ఉండవచ్చని భావిస్తున్నట్లు తెలిపారు. అయితే మరణానికి గల ఖచ్చితమైన కారణాలు పోస్టుమార్టం నివేదిక అనంతరం వెల్లడికానున్నాయి. మృతుడు తెలుపు మరియు నలుపు రంగుల బార్డర్లు కలిగిన టీ–షర్ట్ ధరించి ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ మృతదేహానికి సంబంధించిన పేరు, చిరు నామా, కుటుంబ సభ్యుల వివరాలు లేదా ఇతర సమాచారం తెలిసిన వారు వెంటనే రేణిగుంట పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని స్టేషన్ హౌస్ ఆఫీసర్ ప్రజలకు,మీడియా ప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు.

## ప్రజా సమస్యలు పరిష్కారం కాకపోవడానికి ప్రభుత్వ వైఫల్యాలే కారణం.

**పలమనేరు,చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్15:**




రాష్ట్రంలో ప్రజా సమస్యలు పరిష్కారం కాకపోవడానికి ప్రభుత్వ వైఫల్యాలే కారణమని హైకోర్టు న్యాయవాది, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు చింతమాకుల పుణ్యమూర్తి పేర్కొన్నారు. అందులో భాగంగా సోమవారం డి.వి. మునిరత్నం అధ్యక్షతన గంగ వరం మండలం డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ భవన్లో ప్రజా సమస్యలు, న్యాయ సలహాలు, పరిష్కార మార్గాలు అనే నినాదంతో ప్రజలతో మేమేకమై గ్రీవెన్స్ డే నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వీకోట, బైరెడ్డిపల్లి, పలమనేర్, గంగవరం, పెద్దపంజాణి మండలాల నుండి అనేకమంది హాజరై వారి వారి సమస్యలను లిఖితపూర్వకంగా పుణ్యమూర్తికి సమర్పించడం జరిగింది. పలు సమస్యలపై అక్కడికి హాజరైన లబ్ధిదారులకు వారి సమస్యలను బట్టి న్యాయ సలహాలు, వాటి పరిష్కార మార్గాలు సూచించడం జరిగింది. ఎక్కువ శాతం రెవిన్యూ శాఖకు సంబంధించిన సమస్యలు రావడంతో వాటిపై మండల తహసిల్దారు రేఖను నేరుగా కలిసి ,చర్చించడం జరిగింది. అదేవిధంగా మండల స్థాయి లో ఉన్న అంబేద్కర్ భవన్ స్థలం శ్రీలంక శరణార్థులు ఆక్రమణ విషయంపై సర్వే చేసి హద్దులు చూపించాలని కోరారు. జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫారసుల మేరకు వరకు మండల స్థాయిలో ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ సమావేశాలు, ఎస్సీ ఎస్టీ కాలనీలో పౌర హక్కుల దినోత్సవం జీవో ప్రకారం క్రమం తప్పకుండా నిర్వహించాలని తాసిల్దారుకు సూచించారు. అనంతరం మండల విద్యుత్ శాఖ అధికారిని అంబేద్కర్ భవనానికి విద్యుత్ కనెక్షన్ మంజూరు చేయాలని కోరారు. గ్రీవెన్స్ డే కి వచ్చిన లబ్ధిదారులు హైకోర్టు న్యాయవాది చిన్న సలహాలను గమనించి ఇప్పటివరకు న్యాయవాదులు ఎవరు ఇలాం టి అవగాహన సదస్సులు నిర్వహించలేదని, హైకోర్టు న్యాయవాది పుణ్యమూర్తికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో 5మండలాలకు లబ్ధిదారులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## టార్గెట్ టూ థర్డ్

2024 ఎన్నికల తరువాత మోదీ ప్రభుత్వం ఇతర పార్టీలపై ఆధారపడాల్సి వచ్చింది. కానీ, గత రెండేళ్లుగా తన బలాన్ని పెంచుకోవడానికి బీజేపీ చాలా చాలా ప్రయత్నాలు చేస్తున్నది. దీర్ఘకాలంగా తమతో ప్రయాణం చేస్తున్న కొన్ని పార్టీలు, పరిస్థితులను బట్టి మారే మరికొన్ని మిత్ర పక్షాలు, రాజకీయ అవసరాలు, అంశాలవారీగా మద్దతిచ్చే పక్షాలకు దగ్గరయ్యేందుకు బీజేపీ ప్రయత్నాలు చేస్తున్నది. లోక్‌సభలో ప్రస్తుతం బీజేపీకి 240 సీట్లు ఉన్నాయి.ఎన్డీయే మిత్రపక్షాలను కలిపినా 293 సీట్లతో సాధారణ మెజారిటీ మాత్రమే ఉన్నది. మూడింట రెండొంతుల మెజారిటీ కావాలంటే 362 సీట్లు అవసరం. మూడింట రెండొంతుల మెజారిటీ లేకపోతే ఏమవుతుందో డీలిమిటేషన్ బిల్లు, మహిళా రిజర్వేషన్ బిల్లు విషయంలో బీజేపీకి అనుభవంలోకి వచ్చింది. దీంతో వివిధ పార్టీలకు దగ్గరయ్యేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టింది. ఇందులో భాగంగానే 20 మంది టీఎంసీ ఎంపీలు లక్ష్యంగా ఆపరేషన్ లోటస్‌కు తెరదీసినట్టు తెలుస్తున్నది.వీరితో పాటు శిరోమణి అకాలీదళ్ కూడా బీజేపీతో జతకట్టే అవకాశం ఉంది. ఎందుకంటే, త్వరలో జరుగనున్న పంజాబ్ ఎన్నికల్లో అకాలీదళ్‌తో బీజేపీ పొత్తు పెట్టుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. అదే జరిగితే, ఈ రెండు పార్టీల సభ్యులను కలుపుకొని ఎన్డీయే బలం 318కి చేరుతుంది. ఇక తమిళనాడులో డీఎంకేను తోసిరాజని టీవీకేతో కాంగ్రెస్ జతకట్టింది. డీఎంకే గతంలోనూ ఎన్డీయేతో కలిసి పనిచేసింది.ఇటీవల ఇండీ కూటమి సమావేశానికి కూడా డీఎంకే దుమ్మా కొట్టింది. ఈ క్రమంలో డీఎంకేను బీజేపీ సంప్రదించవచ్చు. ఇక వైఎస్సార్సీపీ. టీడీపీతో ఆ పార్టీకి రాజకీయ శత్రుత్వం ఎట్లా ఉన్నప్ప టికీ, మొదటినుంచీ బీజేపీతో సత్సం బంధాలు కొనసాగుతూనే ఉన్నా యి. ఝార్ఖండ్ ముక్తి మోర్చా ఇటీ వలి కాలంలో బీజేపీకి అనుకూ లంగానే మాట్లాడుతున్నది. ఎన్నిక ల్లో ఓటమి తరువాతి పరిణామాల క్రమంలో బీజేడీ నేత నవీన్ పట్నాయక్ మళ్లీ బీజేపీ వైపు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. బీఆర్ఎస్ మొదటి నుంచి కూడా కీలకమైన బిల్లుల విషయంలో మాత్రం బీజేపీ ప్రభుత్వానికి మద్దతు ఇస్తూ వస్తున్నది. ఇప్పుడు కూడా అదే వైఖరి కొనసాగించవచ్చు.ఇక శరద్ పవార్‌కు బీజేపీతో మంచి సంబంధాలే ఉన్నాయి. ప్రస్తుతానికి ఇండీ కూటమితో కలిసి ఉన్నప్పటికీ, కూతురు సుప్రియ రాజకీయ భవిష్యత్తు దృష్టిలో పెట్టుకోవాల్సి ఉంది. పవార్‌ను బీజేపీ సంప్రదిస్తే, ఆ పార్టీకి ఉన్న 8 మంది బలం ఎన్డీయేకు చేకూరుతుంది. కాకపోతే, టీఎంసీతో పాటు, ఎన్సీపీని విలీనం చేయాలని సోనియాగాంధీ ఇప్పటికే ఆఫర్ ఇచ్చినట్టు సమాచారం. ఇందుకు ఆ పార్టీలు ఏ మేరకు అంగీకరిస్తాయనేది చూడాలి. శరద్ పవార్‌తో పాటు డీఎంకేను తనకు అనుకూలంగా మార్చుకోగలిగితే.. బయటి నుంచి కూడా ముఖ్య బిల్లుల విషయంలోనైనా మద్దతు ఇచ్చే పార్టీల బలాన్ని కలుపుకొంటే మోదీ ప్రభుత్వ బలం దాదాపు 355కి చేరుకుంటుంది. మూడింట రెండొంతుల మెజారిటీకి ఇంకా ఏడుగురు తక్కువవుతారు. ఇక రాజ్యసభలో మూడింట రెండొంతుల మెజారిటీ అంటే 163. బీజేపీ సొంత బలం 113, మిత్రపక్షాలను కలుపుకొంటే ఈ సంఖ్య 144కి చేరుతుంది. పది మంది టీఎంసీ సభ్యులను కలిపితే 154కి చేరుకుంటుంది. బీజేపీకి మద్దతుగా వైఎస్సార్సీపీ 7, బీజేడీ 5, ముగ్గురు ఇండిపెండెంట్లను కలిపితే 169 అవుతుంది. దీంతో రాజ్యసభలో ఎన్డీయేకు పూర్తి మెజారిటీ వచ్చినట్టే. ఇప్పుడు జరుగుతున్న ఎన్నికలతో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.ముఖ్యమైన బిల్లులను పాస్ చేయించు కోవ డానికి ఈ సంఖ్య చాలా కీలకమవు తుంది. ఉమ్మడి పౌరస్మృతి, డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్లు, ఒకే దేశం, ఒకే ఓటు వంటి బిల్లులను ఆమోదించుకోవడానికి బీజేపీకి ఇప్పుడు నంబర్ అవసరమవుతుంది. ము ఖ్యంగా లోక్‌సభలో మెజారిటీ కోసం బీజేపీ పెద్దలు చాలా జాగ్రత్తగా పావులు కదుపు తున్నారు.మరో వైపు ఈసీ కూడా భారత ఎన్నికల సంఘం కేంద్ర పాలకపక్షానికి అనుకూలంగా వ్యవహరిస్తూ, గత 12 ఏళ్లుగా ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి జేబుసంస్థగా మారిందనే ఆరోపణలు, విమర్శలు అనేకం. స్వతం త్ర ప్రతిపత్తి గల ఈ రాజ్యాంగ సంస్థ పక్షపాతంతో అధికారంలో ఉన్న బీజేపీకి వంతపాడుతున్నదని ప్రజాసం ఘాలు, ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్నాయి. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) పేరిట ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో అధికార పార్టీకి అనుకూలంగా లక్షల ఓట్లు తొలగించి విపక్షాల ఓటమికి కారణమైందనే ఆరోపణలు ఈ మధ్యకాలంలో మిన్నంటుతున్నాయి. సుప్రీంకోర్టు మార్గదర్శకాలను పక్కనపెట్టి, ఎలక్షన్ల కమిషనర్లను ఎంపిక చేసే కమిటీలో భారత ప్రధాన న్యాయమూర్తిని తప్పించి, కేంద్ర ప్రభుత్వం కొత్త గా తీసుకువచ్చిన చట్టం ఏకపక్షంగా ఉండటంతోనే ఎన్నికల కమిషన్ అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నదనే విమర్శ కూడా ఉంది. ఇటీవల మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభకు పోటీచేసిన తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ నామినేషన్‌ను ఎన్నికల సంఘం తిరస్కరించింది.అయితే, ఈ క్రమంలో ఈసీ వ్యవహరించిన తీరు పై అనుమానాలు రాకమానదు. ఎన్నికలు నిస్సందేహం గా, నిష్పక్షపాతంగా జరగాలి. ఎన్నికల పవిత్రతను కాపాడాల్సిన అంతిమ బాధ్యత ఎన్నికల సంఘంపైనే ఉం టుంది. కానీ, కంచె చేను మేసిందన్నట్లుగా ఎన్నికల సం ఘం నిర్ణయం ఉన్నది. నిజంగానే అభ్యంతరాలు ఉంటే వివరణ కోరాల్సింది. అయితే, ఎన్నికల కమిషన్ అలా చేయలేదు. తెలంగాణలో ఎలాంటి ఎఫ్ఐఆర్ లేకుండా, మీనాక్షికి సంబంధం లేని కేసులో వచ్చిన నోటీసులను సాకు చూపి నామినేషన్ తిరస్కరించడం సబబు కాదు. ఈ తతంగం వెనుక బీజేపీ ఉందనే ప్రచారం జరుగుతున్నది.మొన్నటికి మొన్న తమిళనాడులో గవర్నర్ అవలంబించిన తీరు ప్రజాస్వామ్య వ్యవస్థలో ఆందోళన కలిగించింది. అక్కడ ప్రజలు ఎన్నుకున్న అతిపెద్ద పార్టీని ప్రమాణస్వీకారానికి పిలువకుండా, రెండు రెండు ఆరు అన్నట్లుగా గవర్నర్ వ్యవహారశైలి ఉన్నది. బీజేపీ ఏజెంట్‌గా వ్యవహరించి తన సీటు గౌరవాన్ని తగ్గించారు. గవర్నర్‌కు సొంతంగా నిర్ణయాలు తీసుకునే అధికారం చాలా పరిమితమని తెలిసి కూడా కర్రపెత్తనానికి ఒడిగట్టారు. రాజ్యాంగ పరిషత్ చర్చల్లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గవర్నర్ల పాత్రను చాలా స్పష్టంగా వివరించారు.బ్రిటిష్ పార్లమెంటరీ విధానంలోని 'ది కింగ్ కెన్ డూ నో రాంగ్' అనే సూత్రం తెలిసినట్టుగా లేదు. రాజ్యాంగ నిబంధనల ప్రకారం చూసినా తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత విజయ్‌కు ముఖ్యమంత్రిగా మొదటి అవకాశం ఇవ్వాలి. రాజ్యాంగంలోని ఆర్టికల్ 164(1) ప్రకారం, అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఏ ఒక్క పార్టీకి లేదా కూటమికి స్పష్టమైన మెజారిటీ రానప్పుడు, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు అతి పెద్ద పార్టీ నాయకుడిని ఆహ్వానించే విచక్షణాధికారం గవర్నర్‌కు ఉంటుంది.అయితే, ఎమ్మెల్యేల సంతకాలు ముందే కావాలని గవర్నర్ పట్టుబట్టారు. ఇది ముమ్మాటికీ గతంలో ఎన్నడూ లేని కొత్త నిబంధనలను సృష్టించడమేనని న్యాయ నిపుణులు అభిప్రాయపడ్డారు. ఈ తతంగాన్ని చూశాక గవర్నర్ వ్యవస్థ అనేది కేంద్ర ప్రభుత్వం చేతుల్లో పావుగా మారిందని అందరికీ అర్థమైపోయింది. మెజారిటీ ఉందో, లేదో తేల్చాల్సింది లోక్‌భవన్ గదుల్లో కాదు కదా? ఈ ప్రాథమిక సూత్రాన్ని విస్మరించి విజయ్ వద్ద మ్యాజిక్ ఫిగర్ లేదని సాకు చూపుతూ ప్రమాణ స్వీకారానికి ఆహ్వానించక, ప్రజా తీర్పును లోక్‌భవన్ అవమానించింది. అసెంబ్లీ వేదికగా మాత్రమే బలనిరూపణ జరగాలని సుప్రీంకోర్టు గతంలో పలు తీర్పుల్లో స్పష్టం చేసిన విషయాన్ని మరువరాదు.

Edited Printed Published & Owned by Dama VijayAKumar. And Printed at Vijay Publishers and Printers, #1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh. Published at Vijay Publications, 1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh. EDITOR DAMA VIJAYAKUMAR, RNI. NO. APTEL/2023/86143